# ఆదర్శ నగరంగా 'ఖమ్మం'

ప్రజలకు మెరుగైన వసతుల కల్పన
శ్రీవారి ఆలయంతో ఆధ్యాత్మిక శోభ
మోడల్‌గా డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ విధానం
మంత్రి తుమ్మల హామీ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** హైదరాబాద్‌కు ధీటుగా ఖమ్మం నగర ప్రజలకు మెరుగైన వసతుల కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దటమే తన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. గురువారం ఖమ్మం నగరంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి పర్యటించి పలు డివిజన్లలో సిసి డ్రైన్లు, రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు కలెక్టర్, మంత్రి శంకుస్థాపన చేశారు. 15వ డివిజన్ అల్లిపురంలో మోడల్‌గా ఏర్పాటు చేసిన డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ విధానాన్ని, పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయాలు కాదని చేసిన అభివృద్ధి శాశ్వతంగా ఉంటుందని తెలిపారు. కార్పొరేటర్ల హయాంలో అభివృద్ధి జరిగితే వారిని పది కాలాల పాటు గుర్తుంచుకుంటారన్నారు. ఖమ్మం నగరంలో ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు కృషి



చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ నిధులతో పాటు ఇతర నిధులను తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రూ. 200 కోట్లతో నిరంతరం తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు రహదారులు, డ్రైన్లు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రజల చిరకాల వాంఛ అయిన శ్రీవారి ఆలయ నిర్మాణానికి కృషి చేసినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణానికి 20 ఎకరాలు భూమి కేటాయించామని, టిటిడి బోర్డు కూడా నిర్మాణానికి ఆమోదం తెలిపిందన్నారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని ఆలయ నిర్మాణం పూర్తయితే చిన్న తిరుపతిగా అభివృద్ధి చెందుతుందన్నారు. నగరం నలువైపులా జాతీయ రహదారులను నిర్మాణం జరుగుతుందని ఖమ్మం చుట్టూ రింగ్ రోడ్డు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. 15వ డివిజన్ అల్లిపురంలో దేశంలో ఎక్కడలేనివిధంగా ఇతర దేశాలకే పరిమితమైన డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి శుద్ధి చేసిన నీటిని 24 గంటలు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఇంటిలోని ట్యాంకుకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయడం జరుగుతుందని తద్వారా ఇంట్లోని అన్ని ట్యాపులకు ఆ నీరు సరఫరా అవుతుందన్నారు. ఈ విధానాన్ని ఖమ్మం నగరంలోని అన్ని డివిజన్లలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్పొరేటర్లుగా ప్రజల మన్ననలు పొందినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు

డబుల్ బెడ్రూమ్, ప్రజా దర్బార్ వినతులు
ఇందిరమ్మ ఇండ్లపై కలెక్టర్ సమీక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అర్హులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. డబుల్ బెడ్రూమ్, ప్రజా దర్బార్ వినతులు, ఇందిరమ్మ ఇండ్ల పరిష్కార ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో డబుల్ బెడ్రూమ్, ప్రజా దర్బార్ దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా దర్బార్ కార్యక్రమంలో మొదటి ఏడు క్లస్టర్లలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులలో 78 దరఖాస్తులకు సంబంధించిన పూర్తి వివరాలు అందలేదని తదుపరి సమావేశం నాటికి పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 6,107 డబుల్ బెడ్రూమ్ ఇండ్లు పూర్తయ్యాయని 655 ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయని 467 ఇండ్లు ప్రారంభం కాలేదన్నారు. ప్రారంభం కానీ ఇండ్లను రద్దు చేయాలని ఆదేశించారు. ఎంపిక చేసిన 6,094 మంది లబ్ధిదారులకు ఇండ్లను అప్పగించాలని తెలిపారు. భూమి లేని పేద లబ్ధిదారులకు నిర్మాణంలో ఉన్న 655 డబుల్ బెడ్రూమ్ ఇండ్లను కేటాయించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏడు క్లస్టర్లలో ఎల్3 దరఖాస్తులను పరిశీలించి అర్హులుగా గుర్తించిన వారిని ఎల్1 కేటగిరీకి మార్చాలని సూచించారు. ఈ సమావేశంలో పిడి హౌజింగ్ శ్రీనివాస్, ఈడిఎం దుర్గాప్రసాద్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ జుహేద, సివిల్ టిసి బి. లావణ్య, కె. రాహుల్, జాగారాం,



ఎఈలు స్నేహ, యుకేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**విద్య, వైద్య, మౌలిక వసతుల పనులు గడువులోగా పూర్తి చేయాలి :**
జిల్లాలో కొనసాగుతున్న విద్య, వైద్య, మౌలిక వసతుల అభివృద్ధి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి విద్య, వైద్య రంగాల మౌలిక వసతుల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 15 జూనియర్ కళాశాలల మరమ్మతు పనులు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి సమీక్ష సమావేశానికి ప్రాజెక్టుల వారీగా ఎదురవుతున్న సమస్యలను స్పష్టంగా నివేదికలో పొందుపర్చాలన్నారు. ఏమైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో పిఆర్ఎస్ఈ వై. వెంకటరెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఈ ఎం. యాకోబ్, ఈఈలు బుగ్గయ్య, ఉమామహేష్, బషీర్, మహేష్‌బాబు తదితరులు ఉన్నారు.

**వైద్య సేవలతో పాటు పరిపాలనపై దృష్టి :**
ఆసుపత్రిలో వైద్య సేవలతో పాటు పరిపాలనపై వైద్యులు దృష్టిపెట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డా।। పి. శ్రీజతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నమోదవుతున్న రోజు వారి ఒపి, ఆసుపత్రుల్లో జరుగుతున్న ప్రసవాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రుల్లో పనిచేయని యంత్రాలు ఏమైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలన్నారు. హెచ్‌పివి వ్యాక్సినేషన్ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. వైద్యులు వైద్య సేవలతో పాటు పరిపాలన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఆసుపత్రి సిబ్బంది రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కఠిన పదజాలం ఉపయోగించకూడదని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామారావు, అదనపు డిఎం అండ్‌హెచ్‌వో చందునాయక్, ఎన్‌సిడిపివో అరుణాదేవి, డిఐవో టి. సంపత్, ఐ. మోత్యా, వైద్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 15వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. గురువారం డివిజన్ పరిధిలోని అల్లిపురం, పుట్టకోట, కొత్తగూడెం ప్రాంతాల్లో సిసి డ్రైన్లు, సిసి రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. విలీన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా దృష్టిసారించి రహదారులు, డ్రైనేజీ సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, కార్పొరేటర్ రావూరి కరుణ సైదుబాబు, సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, నాయకులు సంక్రాంతి నాగేశ్వరరావు, చేతుల నాగేశ్వరరావు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన పూర్తి

సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



**ప్రజాపక్షం/కల్లూరు:** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు మండలాలలో మొదటి దశ ఇందిరమ్మ గృహాలను పూర్తి స్థాయిలో పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని అధికారులకు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సూచించారు. ఎంపీడీవోలు గృహ నిర్మాణ శాఖ అధికారులు కల్లూరు కమిషనర్ తో గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. మొదటి దశలో మంజూరైన ఇండ్లు పూర్తయిన ఇండ్లు పలు దశల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను సమీక్షించారు. వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా అందించి గృహ ప్రవేశాలు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, కల్లూరు కమిషనర్ రాజశేఖర్, విద్యుత్ శాఖ అధికారి పవన్, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రజల నుంచి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని సూచించారు.

## విపత్తుల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక

కలెక్టర్ అంకిత్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో వరదలు, అటవీ ప్రాంతాల్లో సంభవించే ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి విపత్తుల నిర్వహణకు సంబంధించి మాక్ ఎక్సర్‌సైజ్‌ల నిర్వహణపై ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఎ) ఆధ్వర్యంలో వరదలు, అటవీ ప్రమాదాల నియంత్రణలపై జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి పరివాహన ప్రాంతాల్లో వరదలు సంభవించినప్పుడు జిల్లాలో ముందస్తు, తక్షణ చర్యలను వివరించారు. వరదల అంచనా విధానం, ముందస్తు హెచ్చరికలు జారీ, కంట్రోల్ రూమ్ ఏర్పాటు, పునరావాస కేంద్రాల నిర్వహణ, లోతట్టు ప్రాంతాల్లో శాశ్వత పరిష్కార చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గత అనుభవాలు, సూచనలను దృష్టిలో పట్టుకుని వరదలు, అటవీ ప్రమాదాల సమయంలో అధికార యంత్రాంగం సమన్వయంతో స్పందించేలా సమగ్ర మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్‌డిఆర్ఎఫ్ లీడ్ కన్సల్టెంట్ మేనేజర్ సుధీర్ బహేల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం ఆర్‌డిఓ మధు, సిపిఓ సంజీవరావు, మిషన్ భగీరధ అధికారి తిరుమలేష్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాధ్, ఆర్అండ్‌బి ఇఇ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## ఉపాధి హామీలో 'ఎన్‌ఎంఎంఎస్' రద్దు చేయాల్సిందే

బికెఎంయు డిమాండ్

**ప్రజాపక్షం/చింతకాని :** ఎంజిఎన్ఆర్ఇజిఎస్‌లో ప్రవేశపెట్టిన 'ఎన్ ఎంఎంఎస్' వలన ఉపాధిహామీ కార్మికులకు నష్టం కలుగుతుందని, దీనిని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం చింతకాని మండలం నేరడ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఎన్‌ఎంఎంఎస్ పద్ధతిలో రోజుకు రెండు సార్లు ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాలని సాంకేతికంగా ఈ పద్ధతి ఇబ్బందికరంగా మారిందని ఏరోజుకారోజు నమోదు చేసుకోకపోతే పనిలో చేరడం కుదరడంలేదన్నారు. ఈ నిబంధన వల్ల పథకం ప్రయోజనాలు దెబ్బతిన కూలీలకు ఉపాధి అందని ద్రాక్షగా మారుతుందన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఎన్ ఎంఎంఎస్ విదానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు.



కూలీ డబ్బులు వారం వారం ఖాతాల్లో జమచేయాలన్నారు. ప్రస్తుత నిత్యావసర ధరల దృష్ట్యా రోజు కూలీ రూ.700 చెల్లించాలని డిమాండ్ చేశారు. వేసవి అదనపు అలవెన్సులు ఇవ్వాలని వడగాల్పులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, మండల కార్యదర్శి గోగుల ఆది, నాయకులు రాగం లింగరాజు, వార్డు మెంబర్ అమడాల వెంకటేశ్వర్లు, మేడ భాస్కర్, బత్తుల కృష్ణమూర్తి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉలిక్కిపడ్డ ఫోర్జరీ మాఫియా..!

తేలుకుట్టిన దొంగల్లా కీలక నిందితులు మౌనం
ప్లాట్ కొనుగోలుదారులకు తప్పని తిప్పలు
మాజీ ప్రజాప్రతినిధులపై వెల్లువెత్తుతున్న విమర్శలు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలాన్ని కుదిపేసిన నకిలీ డాక్యుమెంట్ల బాగోతంపై 'ప్రజాపక్షం' ప్రచురించిన కథనం జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చనీయాశంగా మారింది. ఈ వ్యవహారంలో పాలుపంచుకున్న పలువురు వ్యక్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడినట్లు తెలుస్తోంది. ఫోర్జరీలో కీలక పాత్ర పోషించిన వారిపై కథనం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని సమాచారం. అయితే ప్రధాన సూత్రధారులుగా భావిస్తున్న కొందరు రియల్ ఎస్టేట్ నిర్వాహకులు మాత్రం తేలు కుట్టిన దొంగల్లా మౌనం వహిస్తున్నారు. ఈ వ్యవహారం ఎటు తిరుగుతుందోన్న భయంతో సన్నిహితులతో ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, నకిలీ డాక్యుమెంట్ల కారణంగా ప్లాట్లను కొనుగోలు చేసిన పలువురు బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ పరిస్థితి ఏంటి? అన్న అనిశ్చితిలో ఉన్నామని చెబుతున్నారు. సంబంధిత అధికారులకు విషయం తెలిసినప్పటికీ పూర్తి స్థాయిలో తప్పుడు వ్యవహారాలపై చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీస్‌శాఖలు సంయుక్తంగా విచారణ జరిపి పూర్తి స్థాయి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు ఇలాంటి మోసాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరమని అభిప్రాయం వ్యక్తమవుతోం ది.

**ప్లాట్ కొనుగోలుదారులకు తిప్పలు...**
ఒకప్పుడు ఖమ్మం రూరల్ మండలం రియల్ ఎస్టేట్ వ్యాపారానికి చిరునామాగా నిలిచింది. సామాన్యుల నుంచి ఉద్యోగుల వరకు సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని భావించిన వారు ఈ ప్రాంతంలో ప్లాట్లు కొనుగోలు చేసేవారు. అయితే ఖమ్మం కార్పొరేషన్‌లో విలీనమైన తరువాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. నియంత్రణ లేకుండా పెరిగిన రియల్ ఎస్టేట్ వ్యాపారం క్రమంగా ఫోర్జరీలు, నకిలీ డాక్యుమెంట్ల దిశగా దారి తీసింది. ఈ అక్రమాల వల్ల కొంతమంది రియల్ వ్యాపారులు కోట్ల రూపాయల అర్జించినప్పటికీ, నిజమైన నష్టాన్ని మాత్రం ప్లాట్ కొనుగోలుదారులే భరించాల్సి వస్తోంది. ఒకే ప్లాట్‌ను పలువురికి అమ్మడం, నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేయడం, అనుమతులు లేని లేఅవుట్ల విక్రయాలు వంటి ఘటనలు వెలుగులోకి రావడంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఖమ్మం రూరల్ మండలంలో ప్లాట్ కొనుగోలు చేయాలంటేనే ప్రజలు వెనకడుగు వేస్తున్నారు. ఏ స్థలం అసలైనదో, ఏది వివాదస్పదమో తెలియని గందరగోళం ఏర్పడింది. దీంతో రియల్ ఎస్టేట్ రంగంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అంతేకాకుండా జిపిఎ రిజిస్ట్రేషన్‌లతో కొనుగోలు దారులను వ్యాపారులు నిండా ముంచారు. ఇ లా చేసిన రిజిస్ట్రేషన్‌లతో కొనుగోలుదారులు నిత్యం భయం భయంతో బ్రతుకుతున్నారు. ఈ దందాలు మం చి పేరుగాంచిన ప్రధాన రియల్ ఎస్టేట్ వ్యాపారులే చేయడం గమనార్హం.

ప్రజాపక్షం ఎఫెక్ట్

**మాజీ ప్రజాప్రతనిధుల గుండెల్లో గుబులు..**
ఖమ్మంరూరల్ మండలంలో వెలుగుచూస్తున్న అక్రమ ఫోర్జరీ వ్యవహారం ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఈ దందాలో కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారులే కాకుండా, వారితో సన్నిహిత సంబంధాలు కొనసాగించిన కొందరు మాజీ ప్రజాప్రతినిధుల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రియల్ వ్యాపారులతో అనుబంధాలు పెంచుకున్న కొందరు మాజీ ప్రజాప్రతినిధులు సులభంగా భారీ మొత్తంలో డబ్బులు వస్తుండంతో ఈ వ్యవహారంలో భాగస్వాములైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి పెట్టుబడి లేకుండానే లావాదేవీలు జరగడం, భూముల వ్యవహారల్లో వేలు పెట్టి ఆస్తులు కూడగట్టినట్లు వినికిడి. ఈ అక్రమ దందాలో ముఖ్యంగా ఓ పక్క మండలానికి చెందిన మాజీ ప్రజాప్రతనిధితో పాటు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కొందరు మాజీ ప్రజాప్రతినిధులు, అలాగే వెంచర్లు ఏర్పాటైన గ్రామీణ ప్రాంతాలకు చెందిన మాజీ నాయకుల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. దీంతో రాజకీయవర్గాల్లో కలకలం రేగుతోంది. ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేకపోయినా, పూర్తి స్థాయి విచారణ జరిగితే మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

## విద్యుత్ సేవలు అమోఘం

**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యుత్‌శాఖ ప్రజలకందించే సేవలు నాణ్యమైనవని, గృహ వినియోగదారులకు, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని పాల్వంచ విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ రహీముల్ హుస్సేన్ అన్నారు. మండల పరిధి జగన్నాధపురం రైతు వేదికలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వ్యవసాయ క్షేత్రాలు, విద్యుత్ కేంద్రాలు, రైతువారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఇ మాట్లాడుతూ విద్యుత్‌శాఖ నేతృత్వంలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించటానికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పిఎంజెయుజిఎ, పిఎం కుసుం, ప్రజాబాట తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. రైతులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు, విద్యుత్ ప్రమాదాలపై తీసుకొంటున్న భద్రతా చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బొగ్గా నారాయణ, మండల వ్యవసాయాధికారి శంభోశంకర్, జగన్నాధపురం, పునుకుల సర్పంచ్‌లు అనిత, వజ్జా క్రిష్ణవేణి, రూరల్ ఏఈ రవీందర్, రైతులు, విద్యుత్ వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.



## పంటల అవశేషాలను కాల్చవద్దు

**ప్రజాపక్షం/ మధిర :** రైతులు పంటలు అవశేషాలను కాల్చడం ద్వారా మంటలు విస్తరించి ప్రమాదాలకు పంటలు నష్టాలకు దారితీసే అవకాశం ఉందని, అగ్ని ప్రమాదాల నివారణకు రైతులు సహకరించాలని మధిర రూరల్ సిఐ మధు రైతులను కోరారు. గురువారం తన కార్యాలయంలో బోనకల్, మధిర రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఒలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలు కోతలు అయిపోయిన తర్వాత మిగిలిన అవేశేషాలను కాల్చేందుకు ఎక్కువగా ప్రయత్నిస్తుంటారు అని అన్నారు. దీని వలన సమీప పొలాల్లోని పంటలకు మంటలు విస్తరించి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కాలుష్యం పెరిగి ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. పంటల అవశేషాలను కాల్చే చర్యలను నిలువరించేందుకు రైతులకు అవగాహన కల్పించే దిశగా పోలీస్‌శాఖ ద్వారా చర్యలు చేపడుతున్నామని సిఐ తెలిపారు.

## ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర రైతు వేదిక నందు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ క్షేత్రాలు, సౌర విద్యుత్ కేంద్రాలు, వ్యవసాయం యాంత్రికరణ డ్రోన్ వినియోగం అనే అంశాలపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ సబ్సిడీ ద్వారా వ్యవసాయ యాంత్రిక పరికరాలు అందించటం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అలాగే సోలార్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడం కోసం ప్రభుత్వం ద్వారా 85శాతం సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అద్దంకి రవి కుమార్, బాణావత్ రమణనాయక్, జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, మండల సీనియర్ నాయకులు నిడమానూరు వంశీకృష్ణ, కౌన్సిలర్లు యన్నం కోటేశ్వరరావు, రేవతి, వినయ్, వంకాయలపాటి బాబు, ఎలక్ట్రికల్ డిఇ శ్రీనివాస్, అగ్రికల్చర్ సైంటిస్ట్ నాగజ్యోతి, టౌన్ ఎఇ అనీల్, రూరల్ ఎఇ మైథిలి తదితరులు పాల్గొన్నారు.

## వంశపారంపర్య కేన్సర్లకు ఇమ్యూనో థెరపీ చికిత్స

అంకాలజిస్టు డాక్టర్ హరీష్ కంచర్ల





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వంశపారంపర్య కేన్సర్లకు టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనో థెరపీ వంటి చికిత్సలు హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని అంకాలజిస్టు, హెమాటో అంకాలజిస్టు డాక్టర్ హరీష్ కంచర్ల తెలిపారు. గురువారం ఖమ్మం యశోద మెడికల్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అంకాలజిస్టు డాక్టర్ హరీష్ కంచర్ల మాట్లాడుతూ ఊపిరితిత్తుల కేన్సర్ రోగుల తీరులో ఒక గణనీయమైన మార్పును చూస్తున్నామన్నారు. పొగ తాగని వారు, యువకులు అధిక సంఖ్యలో ఈ వ్యాధి బారినపడుతున్నారన్నారు. జన్యుపరమైన కారకాలు ముఖ్యంగా వంశపారంపర్య కేన్సర్‌లలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఎన్‌జిఎస్, పిసిర్ వంటి అధునాతన రోగ నిర్ధారణ పద్ధతులు, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనో థెరపీ వంటి చికిత్సా విధానాలను అమలు పరుస్తున్నామన్నారు. లక్షణాలు కనిపించక ముందే ప్రమాదంలో ఉన్న వ్యక్తులను గుర్తించి తద్వారా చికిత్సలు అందించవచ్చునని తెలిపారు. ఊపిరితిత్తుల కేన్సర్ చికిత్సా విధానంలో సాంప్రదాయ కిమోథెరపీ కాకుండా టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనో థెరపీ వంటి విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. తద్వారా రోగి జీవనం నాణ్యత మెరుగుపడుతుందన్నారు. టార్గెటెడ్ థెరపీ, జన్యు ఉత్పరి వర్తనాలపై, ఇమ్యూనో థెరపీ కేన్సర్ కణాలతో సమర్థవంతంగా పోరాడటానికి శరీరం యొక్క రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుందన్నారు. అధునాతనమైన సాంకేతిక పద్ధతుల ద్వారా ఈ చికిత్సలు ప్రత్యేకంగా సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని ఖమ్మంజిల్లా ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం. శ్రీధర్‌రావు, నాగార్జున, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 108లేక పేదలకు ప్రాణసంకటం




**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండల కేంద్రంలోని జానంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో 108 అంబులెన్స్ సౌకర్యం లేక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ మండల కార్యదర్శి తోకటి కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయంలో రోగులను జిల్లా ఆసుపత్రులకు తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభించిన 108 వాహనం ప్రస్తుతం లేకపోవడం బాధాకరమన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన పినపాకలో అత్యవసర వైద్య సేవలకు 108 ఎంతో అవసరమని తెలిపారు. 108 సేవలు సమయానికి అందక ప్రైవేట్ వాహనాల్లో రోగులను తరలిస్తుండటంతో పేదలపై అధిక ఆర్థిక భారం పడుతోందని, వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వైద్య శాఖ అధికారులు, ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు స్పందించి జానంపేట ప్రభుత్వ ఆసుపత్రికి 108 అంబులెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

## పంపు సెట్లకు సోలార్ కనెక్షన్‌తో అదనపు ఆదాయం: ఎడిఎ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సాగులో ఆధునిక పద్ధతులను అవలంభించాలని ఖమ్మం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం రైతు వారోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు రఘునాథపాలెం రైతు వేదిక నందు విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎడిఎ సంజీవకుమార్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పంపు సెట్లకు సోలార్ కనెక్షన్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీని వల్ల ఏడాదికి రూ.20వేల అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. పిఎం కుసుమ్ పథకం కింద రైతులు సోలార్ ఎనర్జీ ద్వారా కరెంటు ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి విక్రయించవచ్చునని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. ఉమామహేశ్వరరెడ్డి, విద్యుత్ శాఖ ఏఈలు సతీష్, శంకర్, ఏఈవోలు, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

